సాక్షి
తూర్పుగోదావరి

శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



కళ్లకు కట్టినట్టు..


ఇస్రో శాస్త్రవేత్తలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్–3 ప్రయోగం బుధవారం విజయవంతం కావడాన్ని తమ సృజనాత్మకతతో పట్టి చూపారు ఆ విద్యార్థులు. -IIలో▸



చంద్రునికో నూలుపోగు

చంద్రయాన్ – 3 ప్రయోగ విజయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వల్లూరు గ్రామవాసి సూచనలు, సలహాలు కీలకంగా పనిచేశాయి. -IIలో▸

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 3,89,397 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. అలాగే తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

నేడు ఉద్యోగస్తుల అర్జీల స్వీకరణ

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించే కార్యక్రమం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమవుతుందని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ తెలిపారు. ఉద్యోగులు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతినెలా మూడో శుక్రవారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఈనెల నాలుగో శుక్రవారం జరుపుతున్నట్టు తెలిపారు.

మెగా జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం రూరల్: వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం తన కార్యాలయంలో జాబ్ మేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మేళాకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన 19 నుంచి 30 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. ఆసక్తి కలవారు శుక్రవారం ఉదయం 9 గంటలకు తన ధ్రువీకరణ పత్రాలతో మార్గాని ఎస్టేట్స్‌కు వచ్చి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. మెగా జాబ్‌మేళాతో పాటుగా ఉపాధి రుణాల సదుపాయాలు, పారిశ్రామిక ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నక్కా శ్రీనగేష్, మార్గాని సురేష్, పాలిక శ్రీను, ఎస్వీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకే డీఏపీ డైరెక్టర్‌గా వెంకటరెడ్డి

బాలాజీచెరువు(కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ కే.వెంకటరెడ్డిని నియమిస్తూ రిజిస్ట్రార్ సుమలత గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకూ డీఏపీగా ఉన్న ప్రొఫెసర్ మురళీకృష్ణకు గ్రీన్ ఇనీషియేటివ్ డైరెక్టర్, ఐఐఐపీటీ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా, లైబ్రరీ సైన్స్,ఇంక్యుబేషన్ సెంటర్ డైరెక్టర్‌గా నియమించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకటరెడ్డి,మురళీకృష్ణను వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు తన ఛాంబర్‌లో అభినందించారు.

ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వచ్చే నెల ఐదో తేదీన ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రదానం చేసే అవార్డులకు ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం గురువారం ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని పాఠశాలల నుంచి పది మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, ఐదుగురు స్కూల్ అసిస్టెంట్లు, తత్సమానమైన ఉపాధ్యాయులు ప్రతిపాదనలను పంపాలనాన్నారు. జిల్లా పరిధిలో 30 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను, 20 మంది స్కూల్ అసిస్టెంట్లు, తత్సమానమైన ఉపాధ్యాయులు, 10 మంది ప్రధానోపాధ్యాయుల ప్రతిపాదనలను మాత్రమే నిర్ణీత నమూనాలో ఈనెల 28వ తేదీలోగా మండల కమిటీ, డివిజనల్ కమిటీలు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఉపాధ్యాయులు దరఖాస్తులను మండల కమిటీకి ఈనెల 26వ లోపు నిర్ణీత నమూనాలో సంబంధిత తనిఖీ అధికారులకు సమర్పించాలన్నారు. దరఖాస్తు నమూనా జిల్లావిద్యాశాఖాధికారి వెబ్‌సైట్ డీఈవోఈజీ.ఓఆర్‌జీలో అందుబాటులో ఉందన్నారు.

పాముల సయ్యాట



అంబాజీపేట: నిత్యం జనసంచారం ఉన్న ప్రాంతంలో గురువారం రెండు పాములు సయ్యాట ఆడాయి. అంబాజీపేట పెద్దవీధిలో బొర్రా నరసింహమూర్తి ఫ్యాన్సీ షాప్ వెనుక సుమారు గంటపాటు రెండు జెర్రిపోతులు ఆడిన ఈ సయ్యాటను ప్రజలు పెద్ద సంఖ్యలో వీక్షించారు.

తుంపర.. సాగు పరంపర

- ఏటా పెరుగుతున్న సూక్ష్మ సేద్యం విస్తీర్ణం
- గతేడాది 2,900 హెక్టార్లలో సాగు
- ఈ ఏడాది 3,951 హెక్టార్లలో సాగు లక్ష్యం
- సబ్సిడీపై సర్కారు పరికరాలు మంజూరు
- చిన్న సన్నకారు, పెద్ద రైతులకు చేయూత



చెరుకుమిల్లి గ్రామంలో బిందు సేద్య పరికరాలు అమర్చిన పొలం



సాక్షి, రాజమహేంద్రవరం: పంట సాగులో నీటి ఎద్దడిని అధిగమించే సూక్ష్మ సేద్యానికి ఆదరణ పెరుగుతోంది. ఏటా ఈ సేద్యం ద్వారా సాగు చేసే రైతుల సంఖ్య రెట్టింపవుతోంది. గతేడాది జిల్లా వ్యాప్తంగా 2,900 హెక్టార్లలో పంట సాగు చేస్తే.. ఈ ఏడాది ఇప్పటికే 3951.77 హెక్టార్ల సాగుకు రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారంటే ఏ మేరకు మక్కువ చూపుతున్నారో అర్థమవుతోంది. అందుకు అనుగుణంగా ప్రభుత్వం కూడా ప్రోత్సాహం అందిస్తోంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో ఉద్యాన, వాణిజ్య పంటలు సాగు చేసుకునే బిందు, తుంపర సేద్య పరికరాలు (డ్రిప్, స్ప్రింక్లర్) రైతులకు అందజేస్తోంది. బహిరంగ విపణిలో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయకుండా.. ఆర్బీకేల ద్వారా నామ మాత్రపు రుసుము చెల్లిస్తే చాలు.. సబ్సిడీపై సరఫరా చేసేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఆసక్తి కలిగిన రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వరకు పూర్తి చేసుకుంది. ఇప్పటికే 638.40 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరయ్యాయి.

2023–24 లక్ష్యాలు ఇలా..

జిల్లాలో వరితో పాటు ఉద్యాన పంటలు సాగు చేస్తుంటారు. సింహభాగం పంటలకు సాగునీటి వసతి ఉన్నా.. మెట్ట ప్రాంతంలో కాస్త నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే బిందు, తుంపర సేద్య పరికరాల ఆవశ్యకత ఉంది. ఈ తరుణంలో 2023–24లో 3,000 హెక్టార్లల్లో బిందు, తుంపర సేద్యం ప్రోత్సహించాలని మైక్రో ఇరిగేషన్ అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందుకు రూ.17 కోట్లతో పరికరాలు అందజేసేందుకు సమాయత్తమవుతున్నారు. అర్హులైన రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించారు. మైక్రో ఇరిగేషన్ కంపెనీలు పరికరాలు సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. పథకం అమలు, దరఖాస్తుల స్వీకరణ, సర్వే, బిందు, తుంపర సేద్య పరికరాల బిగింపు తదితర అంశాలను 367 రైతు భరోసా కేంద్రాల్లోని ఉద్యాన సహాయ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. క్షేత్ర స్థాయి నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన మైక్రో ఇరిగేషన్ విభాగం అధికారులు అర్హత ఉన్న వారిని ఎంపిక చేసి సర్వే చేస్తారు. ఈ ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా సాగుతోంది. అధికారుల అంచనాలకు మించి ఇప్పటికే 3,102 మంది రైతులు 3951.77 హెక్టార్ల విస్తీర్ణానికి పరికరాలు కావాలని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

గతేడాది లక్ష్యానికి మించి

గతేడాది సూక్ష్మ సేద్యం ద్వారా 2,000 హెక్టార్లు సాగు చేయాలని నిర్దేశించుకోగా.. అంతకు మించి 2,941 హెక్టార్లలో సాగు చేసి 147.05 శాతం లక్ష్యాన్ని సాధించారు. 47 శాతం అదనంగా సాగు చేపట్టడం విశేషం. గత మూడేళ్లలో పథకానికి రూ.45 కోట్ల మేర వెచ్చించింది. 15,157 మంది రైతులకు సంబంధించి 21,030 హెక్టార్లు పథకంలో సాగు సదుపాయం, పరికరాలు అందజేసింది.

ఐదెకరాల్లోపు 90 శాతం రాయితీ

ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులకు బిందు, తుంపర సేద్య పరికరాలు 90 శాతం రాయితీపై ప్రభుత్వం సరఫరా చేస్తుంది. 5 ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న రైతులకు గరిష్టం 12.50 ఎకరాల వరకు రాయితీ పరికరాలు పొందవచ్చు. 5 ఎకరాల్లోపు ఉన్న రైతులు 90 శాతం, 5 నుంచి 12.50 ఎకరాల పైన ఉన్న రైతులకు 50 శాతం రాయితీ వర్తింప చేస్తారు. తుంపర సేద్యానికి ఒక ఎకరం నుంచి 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు 55 శాతం, 5 ఎకరాల పైన ఉన్న రైతులకు 45 శాతం రాయితీతో పరికరాలు అందజేస్తారు. రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలి. డాక్యుమెంటేషన్ కంపెనీలే చేస్తాయి. రైతు వాటా కింద చెల్లించే నగదు ఫోన్‌పే ద్వారా మైక్రో ఇరిగేషన్ సంస్థకు చెల్లించవచ్చు. బిందు సేద్య పరికాలు ఉద్యాన పంటలకు ఇస్తారు.

జిల్లాలో పరికరాలకు రిజిస్ట్రేషన్లు మంజూరు (హెక్టార్లలో)

మండలం	రిజిస్ట్రేషన్ విస్తీర్ణం	మంజూరు
చాగల్లు	259.42	43.35
తాళ్లపూడి	133.08	10.13
నిడదవోలు	43.63	1.20
దేవరపల్లి	743.47	104.36
గోపాలపురం	913.38	232.56
నల్లజెర్ల	934.60	107.89
సీతానగరం	43.98	7.79
కోరుకొండ	154.14	33.75
గోకవరం	79.50	16.68
రంగంపేట	280.75	55.82
రాజానగరం	131.89	9.25
రాజమండ్రి రూరల్	18.23	1.21
బిక్కవోలు	116.41	14.41

అపరాలకు స్ప్రింకర్లు

- అపరాలు, గడ్డి పండించేకునే రైతులకు సబ్సిడీపై స్ప్రింక్లర్లు ఇస్తారు. 5 ఎకరాల్లోపు 50 శాతం, ఆపై 45 శాతం సబ్సిడీతో అందజేయనున్నారు.

డ్రిప్ ఉపయోగాలు..

- పంటను బట్టి 30–70 శాతం వరకు నీటిని ఆదా చేయవచ్చు. ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చు.
- పొలంలో ఉన్న మొక్కలన్నింటికీ సమానంగా నీరు అందుతుంది. పెరుగుదలలో వ్యత్యాసాన్ని నివారించే వీలుంటుంది.
- పంట సాగులో వేధించే కలుపు సమస్యను అరికట్టే వెసులుబాటు కలుగుతుంది.
- నీటి ద్వారా ఎరువుల సరఫరా చేస్తుండటంతో పెరుగుదలకు అనుగుణంగా పోషకాలు అందుతాయి.
- ఏకకాలంలో పంట కోతకు వస్తుంది.
- 40 శాతం విద్యుత్ ఖర్చు ఆదా అవుతుంది. కూలీల ఖర్చులు తగ్గుతాయి.
- పంటలకు చీడ పీడలు, పురుగు సమస్య తగ్గుతుంది. ఎత్తుపల్లాలు ఉన్న నేలలో సైతం నీటి సరఫరా సులభతరం అవుతుంది. నాణ్యమైన ఉత్పత్తి రావడంతో పాటు ఎకరానికి 20నుంచి 30 శాతం పంట దిగుబడి పెరుగుతుంది.

అవకాశాన్ని వినియోగించుకోవాలి



చిన్న, సన్నకారు రైతులకు బిందు, తుంపర సేద్య పరికరాలు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటాయి. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలి. తక్కువ నీటితో పంటను పండించుకునే వెసులుబాటు కలుగుతుంది. గతేడాది సాగులో గణనీయమైన లాభాలు పొందారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 3951 హెక్టార్లకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. 638 హెక్టార్లకు పరికరాలు మంజూరు చేశాం.

– కె.స్వాతి, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి

వైఎస్సార్ సీపీ జిల్లా సారథి రాజా


- అధ్యక్షునిగా రెండో సారి కొనసాగింపు
- 55 మందితో కూడిన జిల్లా కమిటీ నియామకం



సాక్షి, రాజమహేంద్రవరం: వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నియమితులయ్యారు. ఇప్పటికే పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా పదవీ కాలాన్ని మరో సారి పొడిగించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు వెలువరించింది. ఆయనతో పాటు 55 మందితో కూడిన జిల్లా పార్టీ కమిటీ నియామకం జరిగింది. మరోసారి తనకు కమిటీలో స్థానం కల్పించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని రాజా తెలిపారు. పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ నేతలు, కార్యకర్తల సమన్వయ సహకారంతో గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి బాటలు వేస్తామన్నారు. మరో సారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సీఎం చేయడమే తమ ముందున్న లక్ష్యంగా చెప్పారు. ఉపాధ్యక్షులుగా అడబాల సీతారామకృష్ణ(గొల్లబాబు)(రాజానగరం), గంధ్రోతు సురేంద్రకుమార్(కొవ్వూరు), అడబాల వెంకటేశ్వరరావు(అనపర్తి), నక్కెళ్ల బాబూరావు(రాజమహేంద్రవరంసిటీ), జనరల్‌సెక్రటరీలుగా మహమ్మద్ అబ్దుల్‌ఆరీఫ్(రాజమహేంద్రవరంసిటీ), వాసంశెట్టి మాధవ(అనపర్తి), మన్యం సూర్యనారాయణ (నిడదవోలు), ఆరేటి సూర్యనారాయణ(గోపాలపురం), గెద్దాడ త్రిమూర్తులు (రాజానగరం), కందుల శ్రీనాథ్(రాజానగరం),తాడాల విష్ణు చక్రవర్తి(రాజమహేంద్రవరం రూరల్), సెక్రటరీలుగా ముదునూరి సూర్యనారాయణరాజు(కొవ్వూరు), చేకూరి వీరవెంకట సత్యనారాయణ(రాజానగరం), తాటికొండ విష్ణుమూర్తి(రాజమహేంద్రవరం రూరల్), పంది సత్యనారాయణ(గోపాలపురం), మద్దిపాటి ఫణీంద్ర(నిడదవోలు), పందిరి ఆనంద్ (అనపర్తి), తిబిరిశెట్టి ఆదినారాయణ(అనపర్తి), కొప్పిసెట్టి ప్రసాద్‌బాబు (రాజమహేంద్రవరం రూరల్), కోశాధికారిలుగా కోళ్ల అచ్యుతరామారావు(బాబు), బొమ్మనజయకుమార్(రాజమహేంద్రవరం సిటీ) వీరితో పాటు 31 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమిస్తూ ప్రకటన విడుదల చేసింది.

6,459 మందికి రూ.7.38 కోట్ల లబ్ధి

- ద్వైవార్షిక మంజూరు కింద నగదు జమ
- నమూనా చెక్కు అందజేసిన జేసీ తదితరులు



నమూనా చెక్కు అందజేస్తున్న జేసీ తేజ్ భరత్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

సీటీఆర్‌ఐ రాజమహేంద్రవరం): జిల్లాలో ద్వైవార్షిక మంజూరు కింద అర్హత కలిగిన 6,459 మంది లబ్ధిదారులకు వివిధ పథకాల ద్వారా రూ.7.38 కోట్లను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్టు జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో బటన్ నొక్కి ప్రారంభించారు. ఏ కారణంతోనైనా పథకాల లబ్ధి పొందని అర్హులకు గుర్తించి ఈ లబ్ధిని అందజేస్తున్నారు. స్థానిక కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్. తేజ్ భరత్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందించాలన్నదే జగనన్న ప్రభుత్వం ఏకైక లక్ష్యం అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సోషల్ ఆడిట్ కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితాలు ప్రదర్శించి పారదర్శకంగా నూరుశాతం ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అందజేస్తున్నారన్నారు.

పథకాలు	లబ్ధిదారులు	నగదు (రూ.లక్షల్లో)
రైతుభరోసా	732	67
అమ్మ ఒడి	521	08
చేదోడు	17,801	178
ఈబీసీ	381	57
జగనన్న వసతి దీవెన	913	77
జగనన్న విద్యాదీవెన	1,283	185
వైఎస్సార్ ఆసరా	843	166

రూ.10 వేలు అందింది



చేదోడు పథకం కింద నాకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సొమ్ములతో ఇస్త్రీపెట్టె కొనుగోలు చేస్తాను. బట్టలను ఇస్త్రీ చేసుకుని జీవనం సాగిస్తున్నాను. ముఖ్యమంత్రి జగనన్న ఎంతో తోడ్పాటునిచ్చారు. ఆయన మేలు మరవలేను.

– నరమామిడి భాగ్యలక్ష్మి, బొమ్మూరు

సున్నావడ్డీ వచ్చింది



మాది మహాత్మాగాంధీ స్వయం సహాయక సంఘం. మా గ్రూపునకు మొదటిసారి సున్నావడ్డీ రాలేదు. రెండోవిడతలో వలంటీర్ ద్వారా నమోదు చేసుకున్నాం. దీంతో మా గ్రూపునకు రూ.లక్ష మంజూరైంది. సభ్యురాలినైన నాకు రూ.21 వేలు వచ్చింది. ఈ సొమ్ములతో కుట్టుమెషీన్ కొనుగోలు చేస్తాను.

– ముప్పిడి నవ్య, కొతమూరు

సత్యదేవునికి 'ముత్యాల వస్త్రం'

- తయారీకి పురోహితుల సంసిద్ధం
- ఈఓ చంద్రశేఖర్ అజాద్‌కు అంగీకార పత్రం సమర్పణ



ముత్యాల వస్త్రం (ముత్తంగి) నమూనా



ఈఓ చంద్రశేఖర్ అజాద్‌కు అంగీకారపత్రం సమర్పిస్తున్న పురోహితులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుడు, అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవార్లు, లింగాకారంలోని ఈశ్వరునికి అలంకరించే 'ముత్యాల వస్త్రం' (ముత్తంగి) తయారీలో మరో ముందడుగు పడింది. దేవస్థానం వ్రతపురోహిత సంఘ నాయకుడు నాగాభట్ల రవిశర్మ ఆధ్వర్యంలో పురోహిత సంఘ సూపర్‌వైజర్లు ముత్తంగి తయారీకి అయ్యే వ్యయాన్ని భరించేందుకు అంగీకరిస్తూ దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్‌కు గురువారం అంగీకార పత్రం సమర్పించారు. శ్రీరంగంలోని రంగనాథస్వామి, తిరుమలలోని మలయప్పస్వామి, భద్రాచలంలోని సీతారామస్వామి మంచి ముత్యాలతో రూపొందించిన ముత్తంగి ధరించి భక్తులకు దర్శనమిస్తున్న విషయం తెలిసిందే. రత్నగిరి వాసుడు సత్యదేవునికి కూడా ఈ ముత్తంగి తయారు చేయించాలని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ సంకల్పించారు. దేవస్థానమే సొంతంగా తయారు చేయించాలని తొలుత భావించినా వ్రతపురోహిత సంఘం ఈ వ్యయాన్ని తాము భరించి స్వామి, అమ్మవార్లు, శంకరునికి తయారు చేయిస్తామని తెలిపింది. వీటి తయారీకి అయ్యే ఖర్చు రూ.8 లక్షలు తాము అందజేస్తామని ఈఓకు వ్రతపురోహిత సంఘ నాయకుడు రవిశర్మ తెలిపారు. సత్యదేవుడు, అమ్మవారు, శంకరులకు ముత్తంగి చేయించడం తమ అదృష్టమని, తమకు ఈ అవకాశం కల్పించిన ఈఓ చంద్రశేఖర్ అజాద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు, పురోహిత సూపర్ వైజర్లు పెండ్యాల సత్యనారాయణ మూర్తి, ప్రయాగ ఆంజనేయులు, నాగాభట్ల వీరభద్రశర్మ, తొయ్యేటి సత్యనారాయణ, గుత్తిన రామకృష్ణ, శ్రీరామమూర్తి, మొక్కరాల రామకృష్ణ, ద్విభాష్యం మల్లికార్జునరావు, తొయ్యేటి హరినాథశర్మ, పాలంకి సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

కార్తిక మాసం నాటికి రెడీ



కార్తికమాసం నాటికి సత్యదేవుడు, అమ్మవారు, శంకరులకు ముత్తంగి తయారు చేయించి అందజేయాలని తయారీదారుడు సుధీర్ చరణ్‌ను కోరాం. ముత్తంగి తయారు చేసే హైదరాబాద్‌కు చెందిన చరణ్ సుధీర్ శనివారం దేవస్థానానికి వస్తున్నారు. ఆయన స్వామి, అమ్మవారు, శంకరుల విగ్రహాలను పరిశీలించి కొలతలు తీసుకుంటారు.

– చంద్రశేఖర్ అజాద్, ఈఓ, రత్నగిరి దేవస్థానం

ప్రభుత్వ వైద్య సేవలపై నమ్మకాన్ని పెంచండి



సమావేశంలో మాట్లాడుతున్న సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

కొవ్వూరు: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలో జీఎస్‌రావు కాపు కళ్యాణ మండపంలో వైద్య, ఆరోగ్య సేవలు–సామర్థ్యంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని సూచించారు. మాతా,శిశు మరణాలు సంభవించకుండా వైద్య సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. ఏ తల్లీ గర్భం దాల్చడం వలన మరణించకూడదనే సంకల్పంతో పని చేయాలని ప్రభుత్వ మార్గదర్శకాలు చెబుతున్నాయన్నారు. వివిధ దశల్లో చికిత్సలు అందించడం ద్వారా వైద్య సేవల సామర్థ్యం పెంచుకోవాలన్నారు. రక్త హీనత ఉన్న గర్భిణులను గుర్తించి శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియలో తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను వినియోగించుకోవాలన్నారు. ఆశా వర్కర్స్,హెల్త్ వర్కర్స్ తమ క్లస్టర్ పరిధిలోని గర్భిణికి,బాలింతకు చికిత్స,మందులు అందించాలన్నారు. కొత్త మార్గదర్శకాల ప్రకారం రెండు సార్లు టీఐఎఫ్ఎఫ్ఏ స్కానింగ్ చేయించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెలివరీలు పెంచేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. డోర్ టు డోర్ వెళ్లినప్పుడు ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవాలన్నారు. అవసరమైన వారికి సకాలంలో మందులు అందించాలన్నారు. డీసీహెచ్‌ఎస్ ఎం.సనత్‌కుమారి,డీఎంహెచ్‌వో కె.వెంకటేశ్వరరావు వైద్యులు, ఆశావర్కర్స్, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని



కొమ్మినేనికి ఆశీస్సులు అందజేస్తున్న వేద పండితులు


అన్నవరం: రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు గురువారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఆలయం వద్ద వారికి ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ ఆధ్వర్యంలో పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజేశారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావును ఈఓ స్వామివారి శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదాలు, చిత్రపటాన్ని బహూకరించారు. ఆయనకు రత్నగిరిపై గల స్మార్త, ఆగమ పాఠశాల, గోశాల చూపించి అక్కడ జరుగుతున్న కార్యక్రమాల గురించి ఈఓ వివరించారు.

కళ్లకు కట్టినట్టు..

అనపర్తి: ఇస్రో శాస్త్రవేత్తలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్–3 ప్రయోగం బుధవారం విజయవంతం కావడాన్ని తమ సృజనాత్మకతతో పట్టి చూపారు ఆ విద్యార్థులు. మండలంలోని రామవరం జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి దాస్యం వెంకట త్రివిక్రమ్ చీరలు, జాకెట్లు మగ్గం వర్క్‌ను ఉపయోగించే సుమారు 2,40,990 స్టోన్స్‌ను వినియోగించి రాకెట్ అంతరిక్షానికి చేరుకుని జాబిల్లిని ముద్దాడుతున్నట్లుగా దృశ్యాన్ని, దానిచుట్టూ ఉన్న గ్రహాలు, జాతీయ పతాకం, ఇస్రో లోగోలతో కొల్లాజ్ ఆర్ట్‌ను చిత్రించాడు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా ఈ చిత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొల్లాజ్ ఆర్ట్ వేసిన విద్యార్థి త్రివిక్రమ్, అతనిని ప్రోత్సహించిన పాఠశాల డ్రాయింగ్ టీచర్ మండపల్లి సత్యానందంను సత్కరించారు. డ్రాయింగ్ టీచర్ సత్యానందం నిర్వహిస్తున్న అకాడమీలో శిక్షణ పొందుతున్న ఎల్.లాజర్ పెన్సిల్ ముల్లుపై చంద్రయాన్–3 రాకెట్ మైక్రో ఆర్ట్ వేశాడు. ఐ.సాధాఘర్ చంద్రయాన్–3 జాబిల్లిని ముద్దాడిన ఘట్టాలతో కూడిన పెయింటింగ్‌ను చిత్రీకరించి ఆకట్టుకున్నాడు.



కొల్లాజ్ ఆర్ట్ వేసిన త్రివిక్రమ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి





చంద్రయాన్-3 జాబిల్లిని ముద్దాడిన ఘట్టాలతో కూడిన పెయింటింగ్. (అంతరచిత్రం) పెయింటింగ్‌ను గీసిన సాధాఘర్



పెన్సిల్ ముల్లుపై చంద్రయాన్-3 మైక్రోఆర్ట్ (అంతరచిత్రం) రూపొందించిన ఎల్.లాజర్

చంద్రునికో నూలుపోగు

- చంద్రయాన్ – 3 విజయంలో వల్లూరి వాసి పాత్ర
- రిటైర్డ్ ఇండియన్ ఎలక్ట్రో ఆప్టికల్ ఇంజినీర్ వేగుళ్ల కోటేశ్వరరావు కృషి
- ఆయన సూచనలు, సలహాలను ప్రశంసించిన ఇస్రో చైర్మన్
- సంతోషంలో వల్లూరు వాసులు

కపిలేశ్వరపురం: చంద్రయాన్ – 3 విజయవంతమై ప్రపంచవ్యాప్తంగా భారతదేశ కీర్తి పతాకం రెపరెపలాడింది. దేశ ప్రజల్లో సంతోషాన్ని నిలిపిన ఆ ప్రయోగ విజయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వల్లూరు గ్రామవాసి సూచనలు, సలహాలు కీలకంగా పనిచేశాయి. గ్రామానికి చెందిన రిటైర్డ్ ఇస్రో సైంటిస్ట్, ఇండియన్ ఎలక్ట్రో ఆప్టికల్ ఇంజినీర్ డాక్టర్ వేగుళ్ల కోటేశ్వరరావు చంద్రయాన్ -3 ప్రయోగంలో శాస్త్రవేత్తల బృందానికి సూచనలు, సలహాలు ఇస్తూ విశేష కృషి చేశారు. ప్రయోగం విజయం అనంతరం కోటేశ్వరరావు కృషిని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ప్రశంసించారు. గత నెల 14న చంద్రయాన్ ప్రయోగం పూర్తయిన తర్వాత కోటేశ్వరరావు తన స్వగ్రామం వల్లూరు వచ్చి వెళ్లారు. చంద్రయాన్ విజయవంతమైన నేపథ్యంలో ఆయనపై ఈ కథనం...

తండ్రి కోరిక మేరకు చదువుపై శ్రద్ధ

వల్లూరు గ్రామంలో వేగుళ్ల పాపారావు, వీరమ్మలకు 1952 నవంబర్ 1న కోటేశ్వరరావు జన్మించారు. లతామంగేశ్వరితో వివాహమైంది. కుమారుడు రవి వంశీ మెడిసిన్ పూర్తి చేసి యూఎస్‌లో వైద్యవృత్తిలో స్థిరపడ్డారు. కుమార్తె మానస బెంగళూరులో ఉంటున్నారు. కోటేశ్వరరావు సోదరి వల్లూరి రాజేశ్వరి కపిలేశ్వరపురం మండలంలోని నేలటూరులో నివాసముంటున్నారు. పెద్ద కమతం వ్యవసాయం చేసే పాపారావుకు తన కుమారుడు కోటేశ్వరరావుని బాగా చదివించాలన్న కోరిక ఉండేది. ఆయన ఆశకు తగినట్టే కోటేశ్వరరావు శ్రద్ధగా చదువుకున్నారు. గ్రామంలో పాఠశాలలు లేకపోవడంతో ఆరు కిలోమీటర్లు దూరంలో ఉన్న మండపేట పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల విద్య, ఇంటర్మీడియెట్ పూర్తి చేశారు. 1970లో కాకినాడ ఇంజినీరింగ్ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. 1978లో కాకినాడలో మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ పూర్తి చేసిన అనంతరం బెంగళూరులో పీహెచ్‌డీ చేశారు. ఇస్రోలో చేరి శాస్త్రీయ ప్రయోగాల్లో తనదైన శైలిలో సేవలందిస్తున్నారు.

ఇదీ ప్రస్థానం..

కోటేశ్వరరావు బెంగళూరులోని ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్‌లో 1978–83 మధ్యకాలంలో ఇంజినీర్‌గా పనిచేశారు. అక్కడే 1983–88 మధ్యకాలంలో యాటిట్యూడ్ సెన్సార్స్ విభాగంలో టీమ్ లీడర్‌గా పని చేశారు. తర్వాత 1988–93 మధ్య డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా సేవలందించారు. 1993 నుంచి హెడ్ ఫోటోనిక్స్ విభాగంలో సేవలందిస్తున్నారు. 1973లో ఏర్పడిన ఆంధ్ర విజ్ఞాన సమితి–కాకినాడ సంస్థకు జాయింట్ సెక్రటరీగా పనిచేశారు. ఆస్ట్రానామికల్ సొసైటీ ఇండియా, ఇన్‌స్ట్రుమెంట్స్ సొసైటీ ఇండియా సంస్థల్లో సభ్యుడిగా పనిచేశారు.



మాకెంతో గర్వకారణం



డాక్టర్ కోటేశ్వరరావు తండ్రి పాపారావు, మా నాన్న వెంకట సూర్యనారాయణమూర్తి అన్నదమ్ములు. పెద్దనాన్న చాలా ఆసక్తిగా, శ్రద్ధగా వ్యవసాయం చేసేవారు. సోదరుడు కోటేశ్వరరావును బాగా చదివించాలని కోరుకునేవారు. దానికి ఏమాత్రం తీసిపోకుండా దీక్షగా చదువుకున్నాడు. ఈరోజున దేశం సాధించిన ప్రగతిలో సోదరుడు కోటేశ్వరరావు పాత్ర మాకెంతో గర్వకారణంగా ఉంది.

– వేగుళ్ల సత్తిబాబు, వల్లూరు

శాస్త్ర సాంకేతిక అంశాలపై ఆసక్తి చూపేవారు



మండపేటలో పాఠశాల విద్యలో కోటేశ్వరరావు నేను కలిసి చదువుకున్నాం. నేను నాలుగేళ్లు సీనియర్‌ని. కోటేశ్వరరావు కాకినాడలో ఇంజినీరింగ్ చదివారు. నేను వైజాగ్ ఆంధ్ర యూనివర్సిటీలో మెకానికల్ మెరీన్ ఇంజినీరింగ్ చదివాను. శాస్త్ర, సాంకేతిక అంశాలు పట్ల కోటేశ్వరరావు చాలా ఆసక్తి చూపేవారు. ఆనాడు ఆయన చూపిన ఆసక్తి నేడు దేశ కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పేందుకు దోహదపడిందనిపిస్తుంది. చాలా సంతోషంగా ఉంది.

– వల్లూరి కామన్న, సహచర విద్యార్థి, రిటైర్డ్ డాకెండేల్ షిప్పింగ్, బహమస్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ ప్రెసిడెంట్, వల్లూరు

సంప్రదాయాలంటే ఎంతో ఇష్టం..



కోటేశ్వరరావు, నేను పాఠశాల విద్యను కలిసి చదువుకున్నాం. ఆయన సాంకేతిక విద్య చదివారు. నేను ఉపాధ్యాయ రంగాన్ని ఎంచుకున్నాను. కోటేశ్వరరావుకు గ్రామీణ ప్రాంతాలన్నా, భారతీయ సంస్కృతి సంప్రదాయాలన్నా చాలా ఆసక్తి. వల్లూరు వచ్చినప్పుడు పంచె కట్టుకుని సరదా పడతారు. చంద్రయాన్ 3 విజయంలో ఆయన కృషి ఉందంటే నాకెంతో గర్వంగా ఉంది.

– ఎంద్రు సత్యనారాయణ, సహచర విద్యార్థి, రిటైర్డ్ హెచ్ఎం, వల్లూరు

రైలు నుంచి జారిపడిన యువతికి తీవ్ర గాయాలు

అనపర్తి: రైలులో ప్రయాణిస్తున్న ఓ యువతి వేగంగా వెళుతున్న రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి తీవ్ర గాయాల బారిన పడిన ఘటన గురువారం అనపర్తి రైల్వేస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అనపర్తి 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం గ్రామానికి చెందిన తమరాణి దేవి హైదరాబాద్‌లో గల టీసీఎస్ సంస్థలో ఉద్యోగం సాధించి శిక్షణ పొందుతోంది. శ్రావణ శుక్రవారం పూజ నిమిత్తం సొంతూరుకు వచ్చేందుకు దేవి బుధవారం సికింద్రాబాద్‌లో నాందేడ్ ఎక్స్‌ప్రెస్ ఎక్కింది. గురువారం ఉదయం నాందేడ్ ఎక్స్‌ప్రెస్ అనపర్తి రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే అందులో ప్రయాణిస్తోన్న దేవి ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారి పడింది. విషయం తెలుసుకున్న రైల్వే సిబ్బంది, స్థానికులు 108కు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితిలో ఉన్న దేవిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. దేవిని పరీక్షించిన ఆసుపత్రి వైద్యులు ఆమె చెవుల నుంచి రక్తస్రావం కావడాన్ని గమనించి ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు ఆమెను మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాకినాడ ఆసుపత్రికి చేరిన దేవి కుటుంబ సభ్యులు ఆమెను ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించినట్లు సమాచారం.



అనపర్తి ఏరియా ఆసుపత్రిలో దేవికి సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బంది

పీహెచ్‌సీ డాక్టర్ లావణ్యపై కేసు నమోదు

రంగంపేట: ప్రజాప్రతినిధులపై తన కుటుంబ సభ్యులు, అనుచరులతో దాడికి పాల్పడిన రంగంపేట పీహెచ్‌సీ డాక్టర్ డి. లావణ్యపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. గురువారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 21వ తేదీ రంగంపేట మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశం అనంతరం డాక్టర్ లావణ్య తన తండ్రి వెంకట్రావు, సోదరుడు దాసి కిరణ్‌లతో పాటు 40 మంది అనుచరులతో ఎంపీపీ కార్యాలయంలోకి అక్రమంగా ప్రవేశించి జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబుపై దాడి చేస్తుండగా కోటపాడు గ్రామ ఎంపీటీసీ సుంకర అప్పారావు అడ్డుకోవడానికి ప్రయత్నించగా అతనిపై దాడి చేసి గాయపరిచి, చొక్కా చించివేశారు. దీనిపై తగు చర్యలు తీసుకోవలసిందిగా జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డాక్టర్ దాసి లావణ్య, దాసి వెంకట్రావు, దాసి కిరణ్, ఎస్. గంగాభవానీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

తొమ్మిదేళ్లకు పట్టుబడ్డ నిందితుడు

అమలాపురం రూరల్: ఓ బాలికను మోసగించిన కేసులో తొమ్మిదేళ్లుగా పోలీసులకు దొరక్కుండా తప్పించుకుని తిరుగుతూ ఎట్టకేలకు గురువారం అరెస్ట్ అయ్యాడు. పెండింగ్ కేసులపై జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ తరచూ చేస్తున్న పర్యవేక్షణ వల్లే ఆ నిందితుడు పోలీసులకు చిక్కాడు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ వెల్లడించారు. 2014 సంవత్సరంలో అమలాపురం రూరల్ మండలం వన్నె చింతలపూడి గ్రామంలో ఓ మైనర్‌ను ఇదే మండలం పేరూరుకు చెందిన 35 ఏళ్ల ఉమ్మతి దుర్గాప్రసాద్ ప్రేమ పేరుతో మోసగించి, గర్భవతిని చేశాడు. అప్పట్లో రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి నిందితుడు పరారీలో ఉన్నాడు. పోలీసులు అతని ఆచూకీ కోసం తొమ్మిదేళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు, ఎస్సై ఎ.పరదేశి నిందితుడు దుర్గాప్రసాద్‌కు సంబంధించిన కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తూ అతడి కోసం విస్తృతంగా గాలించారు. ఉపాధి కోసం గల్ఫ్ దేశం వలస వెళ్లాడన్న వదంతులపై కూడా పోలీసులు ఆ దిశగా విశాఖ పాస్‌పోర్టు కార్యాలయాన్ని సంప్రదించారు. దుర్గాప్రసాద్‌కు అసలు పాస్‌పోర్టు నమోదు కాలేదని తేల్చారు. చివరకు హైదరాబాద్‌లోని మియాపూర్ ఏరియాలోని ఎఫ్‌సీఐ కాలనీలో ఉంటున్నాడని తెలిసి అక్కడకు పోలీసు బృందాన్ని పంపించి దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు చెప్పారు.

ఫేస్‌బుక్ పరిచయం.. రూ.20 లక్షలకు టోకరా

- పెళ్లి పేరుతో మోసగించిన యువతి
- పోలీసులను ఆశ్రయించిన యువకుడు

కొవ్వూరు: ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన రాజమహేంద్రవరానికి చెందిన బొల్లంకొండ వెంకట సాయి లక్ష్మి మాయమాటలు చెప్పి విడతల వారీగా రూ.20 లక్షలు కాజేసినట్లు పట్టణానికి చెందిన కంఠమణి వెంకట విష్ణుకుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. విష్ణుకుమార్ విశాఖపట్నంలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నారు. ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన ఇద్దరూ తరచూ వీడియో కాల్స్ మాట్లాడుకుంటూ ఉండేవారు. ఈ క్రమంలో విష్ణుకుమార్‌కి మాయ మాటలు చెప్పి పెళ్లి చేసుకుందామని నమ్మించి తన అకౌంట్స్ నుంచి విడతల వారీగా పలుమార్లు సొమ్ము జమ చేయించుకుంది. పలు రకాల వస్తువులు కొనుగోలు చేసి తనతో బిల్లులు కట్టించేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. వివాహం చేసుకుందామని అడిగితే తన బావ వెంకట తిరుమలేశ్వరరావుతో మాట్లాడిస్తానని చెప్పి రూ.2 లక్షలు సొమ్ము జమ చేయించుకుంది. మళ్లీ తన స్నేహితురాలు ప్రీతి ఫోన్ నంబర్ ఇచ్చి ఆమెకు మరో రూ.2.50 లక్షలు ఇస్తే వివాహం చేసుకుంటామని చెప్పించింది. ఆ సొమ్ము చెల్లించలేదన్నారు. అప్పటికే పలుమార్లు, వివిధ మార్గాల ద్వారా రూ.20 లక్షల వరకు చెల్లించారు. చివరిలో అడిగిన సొమ్ము ఇవ్వలేదని వారి ఫోన్‌లు స్విచ్ ఆఫ్ చేసినట్లు, తన వద్ద సొమ్ము తీసుకుని మోసగించినట్లు విష్ణుకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై డి.భూషణం తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

దేవరపల్లి: కూలికి వెళ్లినా ఇల్లు గడవకపోవడంతో వెంటాడుతున్న ఆర్థిక ఇబ్బందుల వల్ల మనస్థాపానికి గురై గ్రామ శివారున గల మామిడితోటలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దేవరపల్లి మండలం పల్లంట్లలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం పల్లంట్లకు చెందిన కట్టా వెంకటేష్(31) వ్యవసాయ పనులకు వెళుతూ ఇద్దరు పిల్లలను చదివించుకొంటూ, కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కూలి పనులకు వెళ్లినా ఇల్లు గడవకపోవడం, ఇద్దరు పిల్లల చదువు భారం కావడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఈ నెల 19న ఇంటి నుంచి బయటకు వెళ్లిన వెంకటేష్ తిరిగి ఇంటికి రాలేదు. దీనితో కుటుంబ సభ్యులు నాలుగు రోజుల నుంచి వెంకటేష్ గురించి వెదికినా ఆచూకీ దొరకలేదు. గ్రామ శివారున గల జీడిమామిడి తోటల్లో గురువారం వెదుకుతుండగా జీడిమామిడి చెట్టుకు చీరతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. మృతుడి భార్య శివపార్వతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె. శ్రీహరిరావు తెలిపారు. వెంకటేష్ మృతికి ఆర్థిక పరిస్థితులే కారణమని, నాలుగు రోజుల క్రితమే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని ఆయన అన్నారు.

భార్యను రక్షించే యత్నంలో గోదావరిలో గల్లంతు

కొవ్వూరు: పట్టణంలో గోష్పాద క్షేత్రంలో స్నానం చేసేందుకు గోదావరిలో దిగిన ఇనపల భవానీ ప్రమాదవశాత్తు ప్రవాహంలో కొట్టుకుపోతుండగా ఆమెను రక్షించేందుకు వెళ్లిన భర్త ఇనపల కార్తీక్ గల్లంతయ్యాడు. రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరుకి చెందిన కార్తీక్ దంపతులు మోటారు సైకిల్‌పై తణుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళుతూ మార్గమధ్యలో గోష్పాదక్షేత్రం వద్దకు వచ్చారు. శ్రావణ మాసం సందర్భంగా స్నానం ఆచరించేందుకు భవానీ గోదావరి నదిలోకి దిగింది. ప్రవాహ వేగం ఎక్కువగా ఉండడంతో ఆమె కొట్టుకుపోతుండగా అక్కడ మెట్లపై కూర్చొన్న ఆమె భర్త కార్తీక్ ఆమెను రక్షించేందుకు నదిలోకి దూకాడు. స్థానికులు మునిగిపోతున్న భవానీని రక్షించి ఒడ్డుకి చేర్చారు. ప్రవాహం వేగంగా ఉండడంతో కార్తీక్ నదిలో గల్లంతు అయ్యాడు. పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు స్థానిక జాలర్ల సాయంతో నదిలో గాలింపు చేపట్టారు.



గోదావరిలో గల్లంతైన కార్తీక్ (ఫైల్)



సినిమా

తెలుగు సినిమా... ఎత్తర జెండా

అల్లు అర్జున్... ఉత్తమ నటుడు



హోల్‌సమ్ ఎంటర్‌టైనర్ ఆర్‌ఆర్‌ఆర్

- తెలుగు సినిమాకి పది అవార్డులు
- 'ఆర్‌ఆర్‌ఆర్'కు ఆరు అవార్డులు
- ఉత్తమ నటీమణులుగా ఆలియా భట్, కృతీ సనన్
- ఉత్తమ చిత్రంగా 'రాకెట్రీ ది నంబి ఎఫెక్ట్'
- ఉత్తమ దర్శకుడు నిఖిల్ మహాజన్

జాతీయ చలన చిత్ర అవార్డుల్లో తొలిసారి తెలుగు సినిమాలు దుమ్ము రేపాయి. మొత్తం పది అవార్డులతో 'ఎత్తర జెండా' అంటూ తెలుగు సినిమా సత్తా చాటింది. 69 ఏళ్ల జాతీయ అవార్డుల చరిత్రలో తెలుగు నుంచి జాతీయ ఉత్తమ నటుడిగా 'పుష్ప... ఫైర్' అంటూ అల్లు అర్జున్ రికార్డ్ సాధించారు. ఆస్కార్ అవార్డుతో చరిత్ర సృష్టించిన 'ఆర్‌ఆర్‌ఆర్' ఆరు అవార్డులతో సిక్సర్ కొట్టింది. వీటిలో 'హోల్‌సమ్ ఎంటర్‌టైనర్' అవార్డు 'ఆర్‌ఆర్‌ఆర్' సొంతం అయింది. 2021 జనవరి 1 నుంచి 2021 డిసెంబరు 31 లోపు సెన్సార్ అయి, అవార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న సినిమాలను పరిగణనలోకి తీసుకుని జ్యూరీ సభ్యులు అవార్డులను ప్రకటించడం జరిగింది. జాతీయ ఉత్తమ నటీమణులుగా 'గంగూబాయి కతియావాడి'లో వేశ్య పాత్ర చేసిన ఆలియా భట్, 'మిమి' చిత్రంలో గర్భవతిగా నటించిన కృతీ సనన్ నిలిచారు. ఖగోళ శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా ఆర్. మాధవన్ టైటిల్ రోల్ చేసి, స్వీయదర్శకత్వంలో రూపొందించిన 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' ఉత్తమ చిత్రంగా, ఉత్తమ దర్శకుడిగా మరాఠీ ఫిల్మ్ 'గోదావరి'కి గాను నిఖిల్ మహాజన్ అవార్డు సాధించారు. ఇంకా పలు విభాగాల్లో కేంద్ర ప్రభుత్వం గురువారం జాతీయ అవార్డులను ప్రకటించింది. ఆ విశేషాలు ఈ విధంగా...

69వ జాతీయ అవార్డులకు గాను 28 భాషలకు చెందిన 280 చలన చిత్రాలు పోటీపడ్డాయి. మొత్తం 31 విభాగాల్లో అవార్డులను ప్రకటించారు. సుకుమార్ దర్శకత్వంలోని 'పుష్ప: ది రైజ్' సినిమాలోని నటనకు గాను అల్లు అర్జున్‌కు ఉత్తమ జాతీయ నటుడిగా తొలి అవార్డు లభించింది. ఇదే చిత్రానికి సంగీత దర్శకుడిగా దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డు సాధించారు. ఇక ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'రౌద్రం..రణం..రుధిరం' (ఆర్‌ఆర్‌ఆర్) సినిమాకు ఆరు విభాగాల్లో అవార్డులు దక్కాయి. జాతీయ హోల్‌సమ్ ఎంటర్‌టైనర్‌గా 'ఆర్‌ఆర్‌ఆర్' నిలిచింది. ఇదే చిత్రానికి ఉత్తమ నేపథ్య సంగీతానికి గాను ఎంఎం కీరవాణి, ఇదే చిత్రానికి స్పెషల్ ఎఫెక్ట్స్‌కి వి. శ్రీనివాస్ మోహనన్, 'నాటు నాటు..' పాట కొరియోగ్రఫీకి ప్రేమ్ రక్షిత్, 'ఆర్‌ఆర్‌ఆర్'లోని 'కొమురం భీముడో..' పాటకు మేల్ ప్లే బ్యాక్ సింగర్‌గా కాలభైరవ, ఇదే చిత్రానికి స్టంట్ కొరియోగ్రాఫర్‌గా కింగ్ సాల్మన్‌లకు జాతీయ అవార్డులు దక్కాయి. ఇక 'నాటు.. నాటు'కి రచయితగా తొలి ఆస్కార్ అవార్డు అందుకున్న చంద్రబోస్ 'కొండపొలం'లోని 'ధంధం ధం.. తిరిగేద్దాం...' పాటకు జాతీయ అవార్డు అందుకోనున్నారు. దర్శకుడిగా తన తొలి చిత్రానికి జాతీయ అవార్డు దక్కిన ఆనందంలో ఉన్నారు 'ఉప్పెన'ను తెరకెక్కించిన బుచ్చిబాబు సన. మైత్రీ మూవీ మేకర్స్‌పై వై. రవిశంకర్, నవీన్ ఎర్నేని నిర్మించిన 'ఉప్పెన' ప్రాంతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా నిలిచింది. ఉత్తమ సినీ విమర్శకుడిగా నల్గొండ జిల్లాకి చెందిన ఎం. పురుషోత్తమాచార్యులకు అవార్డు దక్కింది. రెండేళ్లుగా 'మిసిమి' మాస పత్రికలో సినిమా పాటల్లో శాస్త్రీయ సంగీతంపై పరిశోధనలు చేస్తూ, పలు వ్యాసాలు రాశారు పురుషోత్తమాచార్యులు. ఇక ఆలియా భట్‌కి 'గంగూబాయి కతియావాడి' జాతీయ ఉత్తమ నటిగా అవార్డు దక్కేలా చేయడంతో పాటు మరో నాలుగు విభాగాల్లో (బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్, మేకప్, ఎడిటింగ్) అవార్డులు వచ్చేలా చేసింది. అలాగే విక్కీ కౌశల్ హీరోగా నటించిన బయోగ్రాఫికల్ డ్రామా 'సర్దార్ ఉద్దమ్'కు ప్రాంతీయ ఉత్తమ హిందీ చిత్రంతో పాటు మొత్తం నాలుగు విభాగాల్లో (సినిమాటోగ్రఫీ, ఆడియోగ్రఫీ, ప్రొడక్షన్ డిజైన్, కాస్ట్యూమ్ డిజైన్) అవార్డులు దక్కాయి. ఈ చిత్రానికి సూజిత్ సర్కార్ దర్శకుడు. తమిళ ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కడైసీ వివసాయి', మలయాళంలో 'హోమ్', కన్నడంలో '777 చార్లీ' అవార్డులు గెలుచుకున్నాయి. ఇంకా పలు భాషల్లో పలు చిత్రాలకు అవార్డులు దక్కాయి.



విక్కీ కౌశల్ (సర్దార్ ఉద్ధమ్)



ఆలియా భట్ (గంగూబాయి కతియావాడి)



కృతీసనన్ (మిమీ)

69వ చలనచిత్ర జాతీయ అవార్డు విజేతలు

ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప)
ఉత్తమ నటి: అలియా భట్ (గంగూబాయి..) – కృతీసనన్ (మిమీ)
ఉత్తమ చిత్రం: రాకెట్రీ: ద నంబీ ఎఫెక్ట్ (హిందీ)
ఉత్తమ దర్శకుడు: నిఖిల్ మహాజన్ (గోదావరి– మరాఠీ సినిమా)
ఉత్తమ పిల్లల చిత్రం: గాంధీ అండ్ కో (గుజరాతీ)
ఉత్తమ మ్యూజిక్ డైరెక్టర్ (నేపథ్య సంగీతం): ఆర్‌ఆర్‌ఆర్ – ఎమ్‌ఎమ్ కీరవాణి
ఉత్తమ సంగీత దర్శకుడు (పాటలు): పుష్ప– దేవిశ్రీ ప్రసాద్
ఉత్తమ కొరియోగ్రఫీ: ఆర్‌ఆర్‌ఆర్ –ప్రేమ్ రక్షిత్
ఉత్తమ మేల్ ప్లేబ్యాక్ సింగర్: కాలభైరవ (ఆర్‌ఆర్‌ఆర్ – కొమురం భీముడో..)
ఉత్తమ లిరిక్స్: చంద్రబోస్– కొండపొలం
ఉత్తమ యాక్షన్ డైరెక్షన్ అవార్డ్ (స్టంట్ కొరియోగ్రఫీ): ఆర్‌ఆర్‌ఆర్– కింగ్ సాల్మన్
ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్: ఆర్‌ఆర్‌ఆర్– శ్రీనివాస్ మోహనన్
ఉత్తమ సహాయ నటి: పల్లవీ జోషి (ద కశ్మీరీ ఫైల్స్– హిందీ)
ఉత్తమ సహాయ నటుడు: పంకజ్ త్రిపాఠీ (మిమీ– హిందీ)
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: ప్రీతీశీల్ సింగ్ డిసౌజా (గంగూబాయి కతియావాడి–హిందీ)
ఉత్తమ ఫీమేల్ ప్లేబ్యాక్ సింగర్: శ్రేయా ఘోషల్ (ఇరవిన్ నిఴల్– తమిళ్)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: వీరా కపూర్ ఏ (సర్దార్ ఉద్ధమ్–హిందీ)
ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: ది మిత్రీ మాలిక్ – మాన్సి ధ్రువ్ మెహతా (సర్దార్ ఉద్ధమ్) (హిందీ)
ఉత్తమ ఎడిటింగ్: సంజయ్ లీలా భన్సాలీ (గంగూబాయి కతియావాడి–హిందీ)
ఉత్తమ ఆడియోగ్రఫీ (లొకేషన్ సౌండ్ రికార్డిస్ట్): అరుణ్ అశోక్ – సోనూ కేపీ (చవిట్టు మూవీ–మలయాళం)
ఉత్తమ స్క్రీన్‌ప్లే(అడాప్టెడ్): సంజయ్‌లీలా భన్సాలీ, ఉత్కర్షిణి వశిష్ట (గంగూబాయి కతియావాడి– హిందీ)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): షాహీ కబీర్ (నాయట్టు సినిమా–మలయాళం)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (డైలాగ్ రైటర్): ప్రకాశ్ కపాడియా – ఉత్కర్షిణి వశిష్ట (గంగూబాయి కతియావాడి– హిందీ)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: అవిక్ ముఖోపాధ్యాయ్ (సర్దార్ ఉద్ధమ్ మూవీ–హిందీ)
ఉత్తమ చైల్డ్ ఆర్టిస్ట్: భవిన్ రబరీ (ఛెల్లో షో – గుజరాతీ)
ఉత్తమ ఫిలిం ఆన్ ఎన్విరాన్‌మెంట్ కన్‌జర్వేషన్: అవషావ్యూహం (మలయాళం)
ఉత్తమ ఫిలిం ఆన్ సోషల్ ఇష్యూస్: అనునాద్–ద రెజోనెన్స్ (అస్సామీ)
ఉత్తమ పాపులర్ ఫిలిం ఆన్ ప్రొవైడింగ్ హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్: ఆర్‌ఆర్‌ఆర్
ఉత్తమ ఆడియోగ్రఫీ (సౌండ్ డిజైనర్): అనీష్ బసు (జిలీ మూవీ– బెంగాలీ)
ఉత్తమ ఆడియోగ్రఫీ (రీ రికార్డిస్ట్ ఆఫ్ ద ఫైనల్ మిక్స్‌డ్ ట్రాక్): సినోయ్ జోసెఫ్ (సర్దార్ ఉద్ధమ్–హిందీ)
ఇందిరాగాంధీ అవార్డ్ ఫర్ బెస్ట్ డెబ్యూ ఫిలిం ఆఫ్ ఎ డైరెక్టర్: మెప్పాడియన్ (మలయాళం)
స్పెషల్ జ్యూరీ అవార్డ్: షేర్ షా (హిందీ) (డైరెక్టర్ విష్ణువర్ధన్)
నర్గీస్ దత్ అవార్డ్ ఫర్ బెస్ట్ ఫిల్మ్ ఆన్ నేషనల్ ఇంటిగ్రేషన్: ద కశ్మీరీ ఫైల్స్ (హిందీ)

ఉత్తమ ప్రాంతీయ చిత్రాలు

ఉత్తమ తెలుగు చిత్రం	: ఉప్పెన
ఉత్తమ తమిళ్ చిత్రం	: కడైసి వివసాయి (ద లాస్ట్ ఫార్మర్)
ఉత్తమ కన్నడ చిత్రం	: 777 చార్లి
ఉత్తమ మలయాళ చిత్రం	: హోమ్
ఉత్తమ హిందీ చిత్రం	: సర్దార్ ఉద్దామ్
ఉత్తమ గుజరాతీ చిత్రం	: లాస్ట్ ఫిల్మ్ షో (ఛెల్లో షో)
ఉత్తమ మరాఠీ చిత్రం	: ఏక్దా కే జాలా
ఉత్తమ మీషింగ్ చిత్రం	: బూంబా రైడ్
ఉత్తమ అస్సామీస్ చిత్రం	: అనూర్ (ఐస్ ఆన్ ది సన్ షైన్)
ఉత్తమ బెంగాలీ చిత్రం	: కల్కొకో–హౌస్ ఆఫ్ టైమ్
ఉత్తమ మైథిలీ చిత్రం	: సమాంతర్
ఉత్తమ ఒడియా చిత్రం	: ప్రతీక్ష (ద వెయిట్)
ఉత్తమ మెయిటిలాన్ చిత్రం	: ఈఖోయిగీ యమ్ (అవర్ హోమ్)

'పుష్ప' చిత్రంలో నటనకుగాను అల్లు అర్జున్‌కి జాతీయ ఉత్తమ నటుడు అవార్డు దక్కడం సంతోషం. తొలిసారి ఈ అవార్డు అందుకోనున్న అల్లు అర్జున్‌కి అభినందనలు. 69వ జాతీయ అవార్డులు తెలుగు చిత్ర పరిశ్రమకు బొనాంజాగా నిలిచాయి. అదే విధంగా పాన్ ఇండియా కాన్వాస్‌లో దూసుకుపోతున్న 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రానికి ఆరు విభాగాల్లో ఈ అవార్డులు దక్కటం ప్రశంసనీయం. డైరెక్టర్ రాజమౌళితో పాటు చిత్ర యూనిట్‌కి అభినందనలు. ఉత్తమ సంగీత దర్శకునిగా దేవీశ్రీ ప్రసాద్ (పుష్ప), ఉత్తమ సాహిత్యానికి చంద్రబోస్ (కొండ పొలం) జాతీయ అవార్డుకు ఎంపికవడం అభినందనీయం.
– వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

★★★

తెలుగు సినిమా గర్వపడే క్షణాలివి. జాతీయ ఉత్తమ నటుడిగా నిలిచిన బన్నీ (అల్లు అర్జున్)కి శుభాకాంక్షలు. చాలా గర్వంగా ఉంది. రాజమౌళి విజన్‌లో ఆరు అవార్డులు సాధించిన 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్‌కు, రెండు అవార్డులు సాధించిన 'పుష్ప'కు, 'ఉప్పెన' టీమ్‌కు, సినీ విమర్శకులు పురుషోత్తమచార్యులకు శుభాకాంక్షలు. – చిరంజీవి

★★★

ఇట్స్ సిక్సర్.. జాతీయ అవార్డులు సాధించినందుకు 'ఆర్‌ఆర్‌ఆర్' యూనిట్ అందరికీ శుభాకాంక్షలు. ఎంపిక చేసిన జ్యూరీకి ధన్యవాదాలు. 'పుష్ప'.. తగ్గేదేలే... బన్నీకి, దేవిశ్రీ ప్రసాద్‌లతో పాటు 'పుష్ప' టీమ్‌కి శుభాకాంక్షలు. బోస్ (చంద్రబోస్) గారికి మళ్లీ శుభాకాంక్షలు. 'గంగూబాయి కతియావాడి'తో అవార్డు గెల్చుకున్న మా 'సీత' ('ఆర్‌ఆర్‌ఆర్'లో ఆలియా భట్ సీత పాత్రలో నటించారు)కు కంగ్రాట్స్. 'ఉప్పెన' టీమ్‌తో పాటు జాతీయ స్థాయిలో అవార్డులు గెల్చుకున్నవారికీ శుభాకాంక్షలు.
– రాజమౌళి

★★★

నా నేపథ్య సంగీతాన్ని గుర్తించి, నాకు జ్యూరీ సభ్యులు అవార్డును ప్రకటించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను . చంద్రబోస్‌గారికి, దేవిశ్రీ ప్రసాద్, కాలభైరవ.. మా 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్‌కు శుభాకాంక్షలు. – కీరవాణి

★★★

ఈ జాతీయ అవార్డు మీదే (సంజయ్ సార్, గంగూబాయి.. టీమ్.. ముఖ్యంగా ప్రేక్షకులు). ఎందుకంటే... మీరు లేకుంటే నాకు ఈ అవార్డు దక్కేదే కాదు. చాలా సంతోషంగా ఉంది. ఈ క్షణాలను గుర్తుపెట్టుకుంటాను. మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేసేందుకు ఇంకా కష్టపడతాను. 'మిమి' సినిమాలో నీ (కృతీ సనన్‌ని ఉద్దేశించి) నటన నిజాయితీగా, పవర్‌ఫుల్‌గా ఉంది. ఆ సినిమా చూసి నేను ఏడ్చాను. ఉత్తమ నటి అవార్డుకు నువ్వు అర్హురాలివి. – ఆలియా భట్.

★★★

69 సంవత్సరాలుగా తెలుగు ఇండస్ట్రీకి రాని ఆ అద్భుతాన్ని తీసుకొచ్చిన ప్రేక్షకులకు, నిర్మాతలకు, దర్శకుడికి, ముఖ్యంగా మా ఫ్యామిలీని పతాకస్థాయికి తీసుకుని వెళ్లిన మా అబ్బాయికి (అల్లు అర్జున్) కృతజ్ఞతలు. – అల్లు అరవింద్

ఇంకా వెంకటేశ్, మహేశ్‌బాబు, ఎన్టీఆర్, రామ్‌చరణ్ తదితరులు తమ ఆనందం వ్యక్తం చేశారు.

ఆర్‌ఆర్‌ఆర్ సిక్సర్



కీరవాణి
శ్రీనివాస్ మోహనన్
కాలభైరవ
ప్రేమ్ రక్షిత్
కింగ్ సాల్మన్



దేవిశ్రీ ప్రసాద్
చంద్రబోస్
బుచ్చిబాబు
పురుషోత్తమాచార్యులు



కేక్ కట్ చేస్తున్న అల్లు అర్జున్‌తో కుటుంబ సభ్యులు, 'పుష్ప' టీమ్

మా మైత్రీ మూవీస్ బ్యానర్‌లో 'ఉప్పెన, పుష్ప' చాలా ప్రతిష్టాత్మక చిత్రాలు. జాతీయ అవార్డు అందుకున్న తొలి తెలుగు నటుడిగా అల్లు అర్జున్‌గారు చరిత్ర సృష్టించారు. తెలుగు సినిమా చరిత్రలో ఇది చిరకాలం గుర్తుండిపోతుంది. దేవిశ్రీ ప్రసాద్‌కి అవార్డు రావడం ఆనందంగా ఉంది. 'ఉప్పెన, పుష్ప' రెండు విజయాల్లో సింహ భాగం సుకుమార్‌గారిదే. 'ఆర్‌ఆర్‌ఆర్, కొండపొలం' చిత్రాలకు జాతీయ అవార్డులు రావడం ఆనందాన్నిచ్చింది.
– వై. రవిశంకర్, నిర్మాత

ఇదొక చరిత్ర
– నవీన్ యెర్నేని, వై. రవిశంకర్

అల్లు అర్జున్‌గారికి జాతీయ అవార్డు రావడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది. ఇదొక చరిత్ర 'పుష్ప' షూటింగ్ సమయంలోనే అల్లు అర్జున్ తప్పకుండా నేషనల్ అవార్డ్ కొడతారని సుకుమార్‌గారు అనేవారు.. అది ఈ రోజు నిజమైంది. మాకు ఇంత మంచి సినిమా ఇచ్చిన అల్లు అర్జున్, సుకుమార్ గార్లకు థ్యాంక్స్. దేవిశ్రీ ప్రసాద్‌కి జాతీయ అవార్డ్ రావడం హ్యాపీ. అలాగే మా 'ఉప్పెన'కి ఉత్తమ తెలుగు సినిమాగా జాతీయ అవార్డు రావడం గర్వంగా ఉంది. దర్శకుడు బుచ్చిబాబు, టీమ్‌కి అభినందనలు. అలాగే 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రానికి ఆరు అవార్డులు రావడం సంతోషంగా ఉంది.
– నవీన్ యెర్నేని, నిర్మాత


''నా తొలి సినిమాకే జాతీయ అవార్డు రావడం హ్యాపీగా ఉంది. నిర్మాతలు నవీన్‌గారికి, రవిగారికి, మా గురువుగారు సుకుమార్ గారికి కృతజ్ఞతలు. సినిమా చూడ్డానికి మా ఇంట్లో నన్ను పంపించేవాళ్లు కాదు. అలాంటిది నేను ఒక సినిమాకి డైరెక్ట్ చేయడం, నా ఫస్ట్ సినిమాకే నేషనల్ అవార్డు రావడం అంటే ఏం మాట్లాడాలో అర్థం కావడంలేదు. మా అమ్మగారికి నేషనల్ అవార్డు అంటే ఏంటో కూడా తెలియదు. ఈ అవార్డు గురించి ఆమెకి చెప్పాలంటే. 'ఇండియాలోనే పెద్ద అవార్డు వచ్చింది' అని చెప్పాలి'' అంటున్న బుచ్చిబాబు సనని తదుపరి చిత్రం గురించి అడగ్గా.. ''రామ్ చరణ్‌గారి కోసం మంచి రా అండ్ రస్టిక్ స్టోరీ రాశాను. నా మనసుకి బాగా నచ్చి, రాసుకున్న కథ ఇది. జనవరిలో షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు.
– బుచ్చిబాబు సన, దర్శకుడు

పది అవార్డులతో తొలి రికార్డ్

ఈసారి తెలుగు పరిశ్రమ ఎక్కువ జాతీయ అవార్డులు సొంతం చేసుకోవడంతో పాటు మరో విశేషమైన రికార్డ్ సాధించింది. అదేంటంటే.. 27వ జాతీయ చలన చిత్ర అవార్డ్స్‌లో 'శంకరాభరణం' (1980) సినిమాకు నాలుగు జాతీయ అవార్డులు లభించాయి. 30వ జాతీయ చలన చిత్ర అవార్డ్స్‌లో 'మేఘ సందేశం' (1982)కి నాలుగు అవార్డులు వచ్చాయి. అలాగే 'దాసి' (1988) చిత్రం 36వ జాతీయ అవార్డ్స్‌లో ఐదు విభాగాల్లో అవార్డులను దక్కించుకుంది. ఆ తర్వాత తెలుగు సినిమాలకు ఐదుకు మించి అవార్డులు రాలేదు. 35 ఏళ్లకు రెండు ఐదులు.. అంటే పది అవార్డులు దక్కించుకుని తెలుగు చిత్రసీమ తొలి రికార్డ్‌ని సాధించింది.

'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్'

భారతదేశ ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త నంబి యార్ నారాయణన్ జీవిత చరిత్ర ఆధారంగా 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా రూపొందింది. ఇస్రోలో చేరిన నారాయణన్ స్వదేశీ రాకెట్లను అభివృద్ధి చేసే ప్రాజెక్ట్‌లో భాగంగా రష్యా డెవలప్ చేసిన క్రయోజెనిక్ ఇంజన్స్‌ని భారత్‌కి తీసుకురావాలనుకుంటారు. ఇదే సమయంలో పాకిస్తాన్‌కు భారత రాకెట్ సాంకేతిక విషయాలను చేరవేశారనే నెపంతో అరెస్ట్ అవుతారు నారాయణన్. అరెస్ట్ తర్వాత కేరళ పోలీసుల విచారణలో ఆయన ఎలాంటి చిత్రహింసలు అనుభవించారు? ఆ తర్వాత ఆయన జీవితం ఎలా మలుపు తిరిగింది? తనపై వచ్చిన తప్పుడు ఆరోపణల నుంచి నారాయణన్ ఎలా విముక్తి పొందారు? అనే నేపథ్యంలో 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా రూపొందింది. నంబియార్ నారాయణన్ పాత్ర చేయడంతో పాటు మాధవన్ దర్శకత్వం వహించారు. నారాయణన్ సతీమణి మీన క్యారెక్టర్‌లో హీరోయిన్ సిమ్రాన్ చక్కగా నటించారు. ప్రత్యేకించి ఆమె పండించిన భావోద్వేగాలు సినిమాకి హైలైట్. హీరో సూర్య అతిథి పాత్రలో మెరవడం కూడా ఈ సినిమాకి ప్లస్ అయ్యింది. ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది.



నా అభిప్రాయాన్ని బలంగా చెప్పాను – ఎంఎం శ్రీలేఖ



''ప్రతి ఏడాది తెలుగు సినిమాలంటే కొంచెం నిర్లక్ష్యం. కంటి తుడుపుగా ఒకటో రెండో అవార్డులు ఇస్తున్నారు. దీనిపై జ్యూరీలో గట్టిగా మాట్లాడేవారు కావాలి. తెలుగుకు ఎందుకు ఇవ్వరు? అని మాట్లాడ గలగాలి. అయితే ఆ సినిమాలో విషయం ఉండాలి.. లేకుంటే మాట్లాడలేం'' అన్నారు సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ. 69వ జాతీయ అవార్డుల్లో దక్షిణాది తరఫున జ్యూరీలో శ్రీలేఖతో పాటు రచయిత్రి బలభద్రపాత్రుని రమణి ఉన్నారు. అవార్డులు ప్రకటించిన అనంతరం ఎంఎం శ్రీలేఖ 'సాక్షి'తో మాట్లాడుతూ – ''మామూలుగా ఫైనల్ ప్యానల్‌లో భోజ్‌పురి వాళ్లు ఉంటారు. వారికి మహానటి సావిత్రి గురించి ఏం తెలుస్తుంది? అందుకే జ్యూరీలో ఉన్న తెలుగువారు తెలుగు సినిమాల గురించి గట్టిగా చెప్పాలి. ఓ జ్యూరీ సభ్యురాలిగా నా అభిప్రాయాన్ని నేను బలంగా చెప్పాను. ఈసారి నేను ఏవైతే రావాలనుకున్నానో దాదాపు వాటికే వచ్చాయి. తొలిసారి తండ్రీ కొడుకులు కీరవాణి అన్నయ్య– కాలభైరవ ఒకే వేదికపై అవార్డులు తీసుకోనుండటం నాకో గొప్ప అనుభూతి. ఇక జ్యూరీ సభ్యులకు ఒత్తిడి ఉంటుందనుకుంటారు.. అలాంటిదేమీ లేదు. నిజాయతీగా నాకు ఏది అనిపిస్తే అది చెప్పాను'' అన్నారు.

ఉప్పెన

మెగా ఫ్యామిలీ నుంచి హీరోగా ఎంట్రీ ఇచ్చిన హీరోల్లో వైష్ణవ్ తేజ్ ఒకరు. ఆయన నటించిన తొలి చిత్రం 'ఉప్పెన'. ఈ సినిమా ద్వారా బుచ్చిబాబు సన డైరెక్టర్‌గా, కృతిశెట్టి హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఈ ముగ్గురూ తొలి సినిమాతోనే బ్లాక్ బస్టర్ అందుకున్నారు. సముద్ర తీరాన ఉప్పాడ అనే పల్లెటూరు. స్కూల్ డేస్ నుంచే బేబమ్మ (కృతీశెట్టి) మీద ఇష్టం పెంచుకున్న మత్స్యకార కుటుంబానికి చెందిన ఆశీర్వాదం (వైష్ణవ్ తేజ్) నిత్యం తననే ఆరాధిస్తూ ప్రేమిస్తుంటాడు. ప్రాణం కంటే పరువు ముఖ్యం అనుకునే పెద్ద మనిషి శేషారాయనం (విజయ్ సేతుపతి). ఆయన కూతురు బేబమ్మ కాలేజీలో చదువుకుంటూ ఉంటుంది. ఆ సమయంలో తన మనసులోని ప్రేమను బేబమ్మకి చెబుతాడు ఆశీర్వాదం. తన స్వచ్ఛమైన ప్రేమను అర్థం చేసుకున్న బేబమ్మ కూడా ఆశీర్వాదాన్ని ప్రేమిస్తుంది. ఇద్దరూ ప్రేమలో ఉన్న విషయం శేషారాయనంకి తెలుస్తుంది. దీంతో ఆశీర్వాదం–బేబమ్మ కలిసి ఊరి నుంచి వెళ్లిపోతారు. ఈ విషయం బయటకి తెలిస్తే తన పరువు పోతుందని ఆర్నెళ్ల పాటు తన కూతురు ఇంట్లోనే ఉందని ఊరి జనాలను నమ్మిస్తాడు రాయనం. ఆరు నెలల తర్వాత అయినా బేబమ్మ ఇంటికి తిరిగొచ్చిందా? తన కులం కానివాడు తన కూతురిని ప్రేమించాడన్న కోపంతో ఆశీర్వాదంని శేషారాయనం ఏం చేశాడు? ఆశీర్వాదం–బేబమ్మ ప్రేమకథ ఎలాంటి మలుపు తీసుకుంటుంది? చివరికి వారిద్దరూ ఒక్కటయ్యారా ? లేదా అనేది 'ఉప్పెన' కథ. 2021 ఫిబ్రవరి 12న విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది.

